
ఎగసిపడుతున్న మంటలు

పేదల జీవితాలపై పిడుగు

- కొబ్బరి చెట్టుపై పిడుగు పడి.. బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం
- ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలింపు
- పొలాల్లోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్న తొమ్మిది మంది
- హాహాకారాలతో దద్దరిల్లిన ఘటనా స్థలం.. ఆస్పత్రి ప్రాంగణం
- సూర్యారావుపాలెంలో ఘటన.. మృతులది వెంకట్రాయపురం, రావిపాడు
- బాధితులందరూ రోజు కూలీలే 7

దీపాల వేళాయెే



జన జీవితాల్లో కాంతులు ప్రకాశించాలి
ఇదే దీపావళి అర్థం.. పరమార్థం

జిల్లాలో ఫైర్‌స్టేషన్ ఫోన్ నెంబర్లు

భీమవరం	08814 - 275399
పాలకొల్లు	08814 - 222299
నరసాపురం	08814 - 275399
ఆకివీడు	08816 - 252099
అత్తిలి	08819 - 257977
తణుకు	08819 - 222101
తాడేపల్లిగూడెం	08818 - 221299

నేడు దీపావళి.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ. అందరి జీవితాల్లో కాంతులు ప్రకాశించే పండుగ. పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే వేడుక. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు దగ్గరే ఉండాలి. లేకపోతే ప్రమాదాలు కొనితెచ్చుకున్నట్లే. మరోవైపు వర్షం దెబ్బకు బాణసంచా అమ్మకాలపై ప్రభావం పడింది. వీటి ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోళ్లు తగ్గాయి. ఈ ఏడాది పనులు లేక జనం వద్ద డబ్బులు లేకపోవడం మరో కారణం. 6లో..

భీమవరంలో రేపటి నుంచి ప్లాస్టిక్ నిషేధం

భీమవరం టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భీమవరంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి క్యారీ బ్యాగుల నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వాటి స్థానంలో కాగితం, క్లాత్, జ్యూట్ బ్యాగులు మాత్రమే వినియోగించాలని సూచించారు. షాపు యజమానులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే ఉపేక్షించే లేదని, ఈ విధంగా చేస్తే అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో భీమవరం సుందరీకరణ పనులపై జేసీ, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ రామచంద్రారెడ్డితో సమీక్షించారు. నిషేధం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూదన్నారు. పట్టణానికి రాబోయే మాసాలలో సుందరీకరణతో కొత్త రూపు సంతరించుకోనున్నట్లు తెలిపారు. వాటర్ ఫౌంటేన్‌లు, మ్యూజికల్ ఫౌంటేన్‌లు, విగ్రహాలకు లైటింగ్, వాల్ పెయింటింగ్స్, గ్రీనరీ అభివృద్ధి, పూల మొక్కలు ఏర్పాటు, ఈట్ స్ట్రీట్ ఏర్పాటు తదితర పనులను చేపట్టాలన్నారు.

దీపావళి శుభాకాంక్షలు

చీకటి నుంచి కాంతులు విరజిమ్మే దీపావళి పండుగను పిల్లలు, పెద్దలు ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ వేడుకను ఆనందోత్సాహాల మధ్య జరుపు కోవాలని కలెక్టర్ నాగరాణి ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు.

పాలకొల్లు టౌన్/భీమవరం టౌన్



దీపాల వేళాయె..







డిష్యుం..డిష్యుం..టపాసులు

దీపావళికి మార్కెట్‌లో విభిన్న హంగులతో టపాసులు సందడి చేస్తున్నాయి. క్రికెట్ బ్యాట్, గన్ బాంబు, చేప స్టార్ ఇలా పలు రకాల టపాసులు అబ్బుర పరుస్తున్నాయి. ఈ టపాసులు కొనుగోలు చేసేందుకు చిన్నారులు ఎగబడుతున్నారు. ఈ టపాసులు అందుబాటు ధరలోనే అందించడంతో సామాన్యులు కొనుగోలుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

-తాడేపల్లిగూడెం రూరల్

తిప్పుడు పొట్లం గుర్తుందా..!



ఒకప్పుడు దీపావళి అంటే నెలరోజుల ముందునుంచే ఇంటిల్లిపాదీ టపాసుల తయారీలో నిమగ్నమై ఉండేవారు. సిసింద్రీలు, తాటాకుల టాపాకాయలు, చిచ్చుబుడ్లు,మతాపులు ఇలా ఇంట్లోనే తయారు చేసుకునేవారు.రూపాయి పెట్టుబడి లేకుండా తిప్పుడు పొట్లాలు తయారు చేసుకుని రోజంతా తిప్పుతూనే ఉండేవారు. ఇప్పటి పిల్లలకు వాటి గురించి తెలియదు..తెలిసినా ఎలా చేసుకోవాలో తెలియదు. తయారుచేయడం కొద్దిగాశ్రమతో కూడుకున్నదే. తాటిచెట్లకు ఉండే చిటికెలు ఎండినవి కోసుకోవాలి. వాటిని మంటలో కాల్చిన తరువాత అవి ఆరేటప్పుడు గోతులో వేసి మట్టితో పూడ్చివేయాలి. కొంత సమయం తరువాత బొగ్గులా మారతాయి. అవి పొడుం చేసి ఆ పొడుంలో కొబ్బరి పొట్టు కలిపి పొట్లంగా తయారు చేస్తారు. దానిని ఉట్టివలే తాడు కడతారు. పొట్లం మీద నిప్పులు కొన్ని వేసి వెలిగించిన తరువాత తాడుతో తిప్పుతూ ఉంటే నిప్పు రవ్వలు మెరుపులు రౌండుగా వెలుగులు చిమ్ముతాయి

- భీమవరం రూరల్

ఏలూరుసిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి.. మన జీవితమే ఒక దీపావళి.. అంటూ పాటలు పాడుకుంటూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. దీపాల పండుగ దీపావళికి అంతటా సిద్ధమైంది. గురువారం రాత్రి అమావాస్య కావడంతో దీపావళి పండుగను గురువారం నాడే చేసుకోనున్నారు. ఇప్పటికే జిల్లాలో దీపావళి పండుగ సంబరాలు మొదలయ్యాయి. దీపావళి పండుగ రోజున ఉదయమే స్నానమాచరించి దేవాలయాలను సందర్శిస్తారు. నూతన వస్త్రాలు ధరించి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించడం హైందవ సంప్రదాయంలో ప్రధానంగా కనిపిస్తుంది. రాత్రి సమయాల్లో లక్ష్మీ పూజ నిర్వహిస్తారు. పూజానంతరం దీపాలను వెలిగించి చిన్నపిల్లలచే గోంకూర కాడలతో డివిటీలు కొట్టిస్తారు. స్వీట్లు తింటారు. తర్వాత పిల్లా పెద్దా అంతా బాణసంచా కాలుస్తారు.

నేడు ఆనందాల దీపావళి

అంతటా పండగ సందడి..చిన్నా పెద్ద సిద్ధం

ఫ్యాన్సీ ఐటెమ్స్‌పై మోజు

దీపావళి పండుగ సందర్భంగా వాడవాడలా బాణసంచా దుకాణాలు వెలిశాయి.ఈ సారి బాణసంచా కొనుగోలులో ధరల భారం తప్పడం లేదని వినియోగదారులు అంటున్నారు. బ్రాండెడ్ పేరుతో ఎమ్మార్పీపై 75 నుంచి 80 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని చెబుతున్నా అవి కూడా గత ఏడాదితో పోలిస్తే ధరలు విపరీతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఈ సారి వెరైటీ ప్రమిదలు మార్కెట్‌లో లభిస్తుండగా ఆన్‌లైన్‌లో నీళ్ళతో వెలుగులు నింపే ప్రమిదలు లభిస్తున్నాయి.

దీపావళి అంటేనే వెలుగుల జిమ్మే పండుగ. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు దీపావళి రోజున అమావాస్య రాత్రి బాణసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో చిచ్చుబుడ్లు, మతాబులు, కాకరపువ్వొత్తులు, సిసింద్రీలు, తారాజువ్వలు, తాటాకు టపాకాయలు, భూచక్రాలు, విష్ణుచక్రాలు , ఉల్లిపాయి బాంబులు, నారబాంబులు , అగ్గిపెట్టెలు వంటివి ఎక్కువగా కాల్చేవారు. ఇప్పుడు రకరకాల ఫ్యాన్సీ ఐటెమ్స్ రంగంలోకి దిగాయి. ఎక్కువగా షాట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఫ్యాన్సీలో కూడా పిప్ పాప్స్ అనే అతిచిన్న ఉల్లిపాయ బాంబులను కాల్చటానికి పిల్లలు ఇష్టపడుతున్నారు. అందుకే వీటి అమ్మకాలు పెరిగాయి. ధరలు అధికమైనా ఫ్యాన్సీ ఐటెమ్స్ కొనేందుకు చిన్న పిల్లలు, యువకులు ఇష్టపడుతున్నారు.

పిల్లలూ.. పెద్దలూ జాగ్రత్త సుమీ

పోలవరం / భీమవరం క్రైం/ ఏలూరు క్రైం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒకసారి పిల్లల కళ్ళల్లో మెరుపులు.. ఆనందాలు చూస్తాం. జిగేల్ జిగేల్మంటూ వెలిగే దీపావళి టపాసుల మెరుపులు శబ్దాలు పిల్లలకు సంతోషాలను సంభ్రమాశ్చర్యాలను పంచుతాయి. టపాసులు కాల్చే సందర్భంలో పిల్లల కళ్లలో కనిపించే సంతోషాల కోసం పెద్దలు పరితపిస్తారు. బాణసంచా కాల్చేటప్పుడు ఆనందం ఎంత ఉంటుందో దాని వెనుక విషాదం కూడా అంతే ఉంటుంది. జాగ్రత్తలు పాటించి బాణసంచా కాల్చుకోవాలి. దీపావళి పండుగ ఆనందంగా మిగిలిపోవాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించండి..

- బాణసంచాను ఇళ్ళలో నిల్వ ఉంచరాదు. దీపపు బుడ్డి, కొవ్వొత్తుల సమీపంలో సామాగ్రి ఉంచవద్దు.. బాణసంచా కాల్చే సమయంలో ప్రాథమిక చికిత్స కిట్లను, ఒక రగ్గును/దుప్పటిని దగ్గరలో ఉంచుకోవాలి. ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవించినా మంటలను అదుపు చేసేందుకు బకెట్లతో నిండుగా నీటిని దగ్గరే పెట్టుకోండి.
- పిల్లలతో పాటు పెద్దలు కూడా కాటన్ దుస్తులను ధరించాలి. నిప్పు రవ్వలు రాజుకుని మంటలు వ్యాపిస్తే వెంటనే ఒంటిపై దుప్పటి లేదా రగ్గు కప్పి మంటలను అదుపు చేయవచ్చు.. వాటిని కప్పడం వల్ల మంటలకు ఆక్సిజన్ అందక పైకి మంటలు వ్యాపిం చవు. పాదరక్షలు తప్పక ధరించవలెను.
- దీపావళి సామాగ్రి కాల్చే సందర్భాలలో పెద్దలు పక్కనే ఉండి పర్యవేక్షించడం మంచిది. కొంతమంది పిల్లలు అత్యుత్సాహంతో టపాసులు కాల్చి గాయాల పాలవు తుంటారు.
- తీవ్రమైన అనారోగ్య సమస్యలలో బాధపడేవారి వద్ద ఎక్కువ శబ్ధంతో, ఒత్తిడితో పేలే బాంబులు వంటివి కాల్చవద్దు. పసి పిల్లలు, నవజాత శిశువుల చెవుల్లో దూది పెట్టడం మరచిపోవద్దు. ఎందుకంటే లేతగా ఉండే వారి కర్ణభేరి చిన్నచిన్న శబ్దాలకు కూడా ఎక్కువగా స్పందిస్తుంది
- ఇంటి ముందు లేదా మేడపైన తాటాకులు గడ్డితో వేసుకున్న నిర్మాణాలపై ముందుగా నీళ్ళు చల్లి ఉంచుకోవడం మంచిది. సమీపంలో ఎక్కడైనా ఇళ్ళ, గడ్డివాములకు నిప్పంటుకుంటే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు సంబంధిత నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- పిల్లల చేతికి రాకెట్, తారాజువ్వ తరహా పెద్ద వస్తువులను ఇవ్వకపోవడమే మంచిది. వయసును దృష్టిలో పెట్టుకుని పిల్లలకు పటాసులు కొనాలి. భూచక్రాలు ఇతర నేలపై మండే టపాసులు కాల్చే సందర్భాలలో బూట్లు లేదా కాలిని కవర్ చేసే విధంగా ఉండే పాదరక్షలు ధరించాలి.
- వెలిగి పేలకుండానే ఆరిపోయిన చిచ్చుబుడ్లు, లేదా బాంబుల వద్దకు వెళ్లి పరిశీలించే ప్రయత్నం చేయడం, మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయవద్దు
- వంటగదులు , పొయ్యిలు, పెట్రోలు , గ్యాస్ వంటి మండే స్వభావాలున్న పధార్థాలున్న ప్రాంతాల్లో పటాసులు ఉంచడం, తడిసిన పటాసులను ఆరబెట్టే ప్రయత్నంలో వేడి చేయడానికి ప్రయత్నాలు చేయడం వంటివి చేయరాదు.
- బహుళ అంతస్తులో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రైవేటు సంస్థల వారు దీపావళి పండుగరోజు అన్ని కిటికీలు, తలుపులు మూసి ఉంచవలెను. బయట నుంచి తారాజువ్వలు, రాకెట్స్ వంటి వాటి వల్ల అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- ప్రభుత్వ ఆదేశానుసారం గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే కాల్చాలి దీని వల్ల వాయు, ధ్వని కాలుష్యాన్ని తగ్గించవచ్చుప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి దీపావళి రోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చవలెను. అగ్నిప్రమాదం సంభవిస్తే 101, 100, 108 నంబర్లకు వెంటనే ఫోన్ చేయాలి

నీటిని దగ్గరలో నిల్వ ఉంచుకోండి



బాణసంచా కాల్చేటప్పుడు బక్కెట్లతో నీటిని దగ్గరగా ఉంచుకోవాలి. ప్రమాద వశాత్తు దుస్తులకు అంటుకుంటే వెంటనే నేలపై పడి దొర్లాలి. వీలైతే గోనెపట్టాలు, దుప్పట్లు మీద వేసి మంట లను ఆర్పాలి. బాణసంచాను చేతిలో ఉంచి కాల్చడం ఎంతో ప్రమాదకరం తల్లి దండ్రులు తమ పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే సమీపంలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించండి. ప్రతి ఒక్కరు దీపావళి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలి.

- రామకృష్ణ, అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్, ఏలూరు జిల్లా

ఎంతపని చేశావ్ వాన దేవుడా !

వర్షాలకు బాణసంచా వ్యాపారం ధమాల్

ఏలూరు రూరల్/ భీమవరం టౌన్/గణపవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి వ్యాపారంపై వర్షం నీళ్ళు చల్లింది. బాణ సంచా వ్యాపారం మొత్తం వెలవెలపోయింది. ఒక వైపు ధరలు మండిపోతుండడంతో అసలే అంతంతమాత్రంగా ఉన్న వ్యాపారాన్ని వర్షం మరింత దెబ్బతీసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జోరున వాన కురిసింది. ఏలూరు ఇండోర్ స్టేడియంలో 48 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. పండుగ ఇంకా కొద్దిగంటలు మాత్రమే ఉండటంతో గురువారం జరిగే వ్యాపారం మీదనే టపాసుల వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. పండుగ రోజు సాధారణంగా వ్యాపారం భారీగా జరిగే అవకాశాలు ఉంటాయి. కురిసిన వర్షానికి స్టేడియంలో నీరు నిలిచిపోయింది. మోటార్లతో నీటిని బయటకు తోడే ప్రయత్నం చేస్తున్నారు. దుకాణదారులు బాణసంచా తడవకుండా ఉండేందుకు నానా అవస్థలు పడ్డారు. కొన్ని దుకాణాల్లో తడిసిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని వర్షం చివరిలో ఇలా కొంపముంచిందని వ్యాపారులు వాపోతున్నారు. గురువారం వానదేవుడు కరుణిస్తే గట్టెక్కుతామని లేకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.



ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు





బాణసంచా కొనుగోలు చేసుకుని వెళుతున్న దృశ్యం





బాణసంచా తడవకుండా దుకాణదారుల అవస్థలు



దీపావళికి ముందు రోజున వర్షం కురవడంతో వ్యాపారం మందకొడిగా సాగుతోంది. ఈసారి ఎంతో నమ్మకం పెట్టుకున్నాం. అమ్మకాలు బాగుంటాయని భావించాం. వర్షం కొంత దెబ్బతీసింది.

- కొప్పుల సత్యనారాయణ, వ్యాపారి, భీమవరం



ఈసారి వ్యాపారం బాగుంటుందని భావించాం. ఇప్పటి వరకు వాతావరణం అనుకూలించినా బుధవారం రెండు సార్లు ఆకస్మాత్తుగా వర్షం పడటంతో అమ్మకాలు తగ్గిపోయాయి. దీపావళి రోజున అమ్మకాలపైనే ఆశలన్నీ..

- జబర్దస్త్ శ్రీను, భీమవరం



గతేడాది ఈ సమయానికి వ్యాపారం జోరుగా ఉండేది. ఈసారి మాత్రం అంతంతమాత్రంగానే ఉంది. వర్షం ప్రభావం బాగా కనిపించింది. గురువారం వాతావరణం అనుకూలిస్తే వ్యాపారం అనుకూలంగా ఉంటుంది.

- రావూరి ప్రసాద్, భీమవరం



దీపావళి స్పెషల్ వంటకం

గోదావరి జిల్లాల్లో నోరూరించే రామల పులుసు





దీపావళి అంటే గోదావరి జిల్లాల్లో రామల పులుసు లేనిదే ముద్ద దిగదని నానుడి. రామలు అంటే గోదావరి వాసులు అత్యంత ప్రీతిగా ఆస్వాదిస్తారు. ఈ రామలు దీపావళి అమావాస్య రోజుల్లో గోదావరి జిల్లాలో విరి విగా లభిస్తాయి. కోనసీమ, గోదావరి, కృష్ణా నదీ ప్రవాహాల్లో రామల సంతతి పెరుగుతుంది. పూర్వీకుల నుంచి రామ లను చింతకాయలతో కలిపి వంటకం తయారు చేస్తారు. వీటిలో వలకట్టు రామలకు మరీ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు చెరువు లలో కూడా వీటిని పెంచుతున్నారు. రామలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా తెలంగాణ, కర్ణాటక, రాష్ట్రాలకు కూడా ఇక్కడ నుంచి ఎగుమతి అవుతుంది. అనేక ఆయుర్వేద ఔషధ గుణాలు ఉండటంతో కిడ్నీ సమస్యలు తొలగిపోతాయని గోదావరి జిల్లాల ప్రజల నమ్మకం.. దీపావళి అమావాస్య వచ్చిందంటే చింతకాయతో వండిన రామల పులుసును తినాల్సిందే అని మనవాళ్ల చెబుతుంటారు.

- పాలకొల్లు రూరల్

సీజన్‌లో మంచి వ్యాపారం



ప్రతీ సంవత్సరం సీజన్లో మంచి వ్యాపారం జరుగుతుంది. మా హోటల్‌కు ఫోన్ ద్వారా కూడా ఆర్డర్లు వస్తూంటాయి. ఎంత ధర అయినా కొను గోలు చేయడానికి రామల ప్రియులు వెనుకాడరు. దీపావళి రోజు దొరికినన్ని రామలను కొంటాం.. వాటిని వండి రామల ప్రియులకు అందజేస్తుంటాం.

కేశవరాజు, శ్రీకన్య హోటల్, పాలకొల్లు


ఔషధ గుణాలు కలిగి ఉంటాయి



చిన్నతనంలో నానమ్మ చింత కాయలతో రామలను వండి వడ్డించేది. దీనిలో ఔషధ గుణాలు ఉన్నాయని పెద్దలు తినిపించేవారు. చిన్నతనంలో రామలు ఎక్కువగా దొరికేవి. నేడు కాలువలు కాలుష్యంగా మారడంతో అరుదుగా లభిస్తున్నాయి. దీపావళి నుంచి కార్తీక మాసం వరకు లభించే రామలను మా బంధువులు, మిత్రులకు పార్శిల్సు ద్వారా పంపుతుంటాం

వర్థినీడి శ్రీనివాస్, పాలకొల్లు

రామల ధర పెరిగింది



ప్రతీ ఏడాది దీపావళి అమావాస్య నుంచి విక్రయించేవారం. గతేడాది సైజును మట్టి ఒక రామ రూ. 15 నుంచి 20 ఉండేది. ప్రస్తుతం రూ.30 వరకూ పెరిగిందని చెబుతున్నారు. రామలను తీసుకువచ్చి విక్రయించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం.

వాడపల్లి శ్రీనివాస్, చేపల వ్యాపారి, పాలకొల్లు

పవిత్రం..కార్తీకం

శివ కేశవులకు ప్రీతికరమైనది అతి పవిత్రమైనది. కార్తీకమాసం. శ్రీ మహావిష్ణువు ఈ మాసంలో అన్ని జీవనదుల్లో సంచరిస్తాడని కార్తీక మాస స్నానాలాచరించడం వల్ల జన్మ జన్మల పాపాలు నశిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. దైవ సంబంధిత వృతాలు, నోములు, ఉపవాసాలు, యోగసాధనకు ఈ మాసం అనువైనది. కార్తీక మాసం నదీ స్నానం చేయడం చాలా మంచిది. మనసుకు ఆధ్యాత్మిక శక్తితో పాటు శరీరానికి మంచి ఆరోగ్యం వస్తుంది.

పోలవరం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యోదయానికి పూర్వమే లేచి నదీస్నానం చేసి పొడి వస్త్రాలు ధరించి దీపారాధన చేయాలి. కార్తీకమాసంలో నదులు, కాల్వలు కోనేటిలో దీపాలు వదులుతారు. ఈ దీపాలు వదలడం వల్ల ఎనలేని కీర్తి సౌభాగ్యాలు కలుగుతాయని విశ్వసిస్తారు. శివాలయాలు, విష్ణాలయాల్లో ఆవు నేతితో దీపాలు వెలిగించడం వల్ల అజ్ఞాన అంధకారం తొలగి విజ్ఞాన జ్యోతులు వెలుగొందుతాయని చెబుతారు. ఈ మాసంలో బ్రాహ్మణు లకు దీప దానం చేయడం ఉత్తమ ఫలితాన్నిస్తుంది. ఎలాంటి మంత్ర దీక్ష తీసుకున్నా గొప్ప ఫలితాలనిస్తుందని కార్తీక పురాణం చెబుతోంది. కార్తీక ఏకాదశి నుంచి కార్తీకపౌర్ణమి వరకూ ఐదు రోజుల వరకూ భీష్మపంచక వ్రతం అంటారు. ఐదు రోజులు శివుడి పంచాక్షరీ మంత్రాన్ని గానీ అష్టాక్షరీ మంత్రంతో అత్యుత్తమ ఫలితాలు ఉంటాయి. అభిషేక ప్రియుడైన శివుడికి పంచామృతాలతో అభిషేకం చేసి ఆవు నేతితో దీపం వెలిగిస్తే దారిద్ర్యం, దుఃఖం తొలగి పోతాయి. ఈ మాసంలో శివ భజనలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు కోటి బిల్వార్చనలు చేస్తారు.



కార్తీక మాసంలో తిథుల వారీగా ఆచరించవలసిన విధి విధానాలు

కార్తీక శుద్ధ పాడ్యమి : కార్తీక శుద్ధ పాడ్యమి రోజు తెల్లవారుజామున లేచి నదీ స్నానం చేయాలి. నదులు లేని చోట కనీసం స్నానం చేసే నీటిలో నదీ జలాలు కొన్ని వేసుకుని స్నానం చేసినా అదే ఫలితం దక్కుతుందని చెబుతారు. శివాలయానికి వెళ్ళి కార్తీక వ్రతం నిర్విఘ్నంగా సాగేట్లు అనుగ్రహింపమని ప్రార్థించి సంకల్పం చెప్పుకుని ఆకాశదీపాన్ని సందర్శించుకోవాలి.

విదియ : ఈరోజు తోడబుట్టిన సోదరి ఇంటికి వెళ్ళి ఆమె చేతివంట తిని ఆమెకు కానుకలు ఇచ్చి ఆశీర్వదించిన వారికి యమగండం ఉండదని పురాణాలు చెబుతున్నాయి.

తదియ : పార్వతీదేవికి స్త్రీలు కుంకుమ పూజ చేయడం ద్వారా సౌభాగ్య సిద్ధి కలుగుతుంది. మాంగల్య బలం, బంధం గట్టిపడతాయి.

చవితి : నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడకి పుట్టలో పాలు పోయాలి. దీనివల్ల సంతాన యోగం, సత్సంతానం కలుగుతాయి.

పంచమి : ఈరోజుని జ్ఞాన పంచమి అని పిలుస్తారు. సుబ్రహ్మణ్యేశ్వరుడికి అర్చనలు అభిషేకాలు చేయించుకున్నవారికి కలి ప్రభావం తొలగి జ్ఞాన వృద్ధి కలుగుతుంది.

షష్టి : ఈ రోజు బ్రహ్మచారిని ఇంటికి పిలిచి భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలతో కండువా దానం చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుంది.



సప్తమి : ఎర్రటి వస్త్రంలో గోధుమలు పోసి దానం ఇవ్వడం వల్ల ఆయుష్షు అభివృద్ధి జరుగుతుంది.

అష్టమి : గోపాష్టమి నాడు గోపూజ చేయడం విశేష ఫలితాన్నిస్తుంది. సమస్త దేవతా కోటి గోవులో కొలువై ఉంటారు.

నవమి :మూడు రోజుల పాటు మహా విష్ణువుని పూజించి విష్ణు సహస్రనామం పఠించాలి.

దశమి : విష్ణు సహస్రనామ పారా యణం చేసి గుమ్మడి కాయ, ఉసిరికాయ దానం చేయాలి.

ఏకాదశి : ఈ ఏకాదశికే బోధనైకాదశి అని పేరు. ఈరోజు విష్ణువుని పూజించడం వల్ల ఉత్తమ గతులు కలుగుతాయి.

ద్వాదశి : ఈరోజు క్షీరాబ్ది ద్వాదశి .. సాయం కాలం తులసి కోటలో ఉసిరి కొమ్మను ఉంచి తులసి, ఉసిరి కల్యాణం చేయడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయి.

త్రయోదశి : ఈరోజు సాలగ్రామ దానం వలన కష్టాలు పోతాయని చెబుతారు.

చతుర్దశి : శనీశ్వర ప్రీత్యర్థం ఇనుము, నువ్వులు, పత్తి దానం చేయడం వల్ల శని సంతృప్తి చెంది శుభ దృష్టిని ప్రసాదిస్తాడు.

పౌర్ణమి : కార్తీక పౌర్ణమి చాలా పవిత్రమైన రోజు. నదీస్నానం చేసి శివాలయం వద్ద జ్వాలా తోరణ దర్శనం చేసుకోవడం వల్ల సకల పాపాలు పటా పంచలవుతాయి.

పాడ్యమి : కార్తీక బహుళ పాడ్యమి రోజు ఆకు కూర దానం చేయడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి.

విదియ : ఈ రోజు ఉసిరి వనాల్లో వనభోజనం చేయాలి.వీలు కుదరని వారి కనీసం ఉసిరి కొమ్మ పెట్టుకుని అయినా భోజనం చేయాలి.

తదియ : పండితులకు గురువులకు తులసి మాలను సమర్పించడం వల్ల ఆరోగ్యం, తెలివి తేటలు, జ్ఞానం కలుగుతుంది.

పంచమి : ఈరోజు చీమలకు నూకలు చల్లడం, శునకాలకు అన్నం తినిపించడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి.

షష్టి : గ్రామ దేవతను పూజించడం వల్ల ఎలాంటి కీడు కుటుంబాలకు కలుగకుండా కాపాడుతారు.



సప్తమి : జిల్లేడు ఆకులతో గుచ్చిన దండను ఈశ్వరునికి సమర్పిస్తే సంపద వృద్ధి చెందుతుంది.

అష్టమి : కాలభైరవాష్టకం చదివి గారెలతో దండ చేసి కాలభైరవుడికి సమర్పించడం వల్ల ధనప్రాప్తి కలుగుతుంది.

నవమి : వెండి లేదా రాగి కలశంలో నీరు పోసి పండితునికి, బ్రాహ్మణుడికి దానం చేస్తే పితృ దేవతలు తరిస్తారు.

దశమి : మహావిష్ణువుకి ప్రీతి పాత్రమైన అన్న సంతర్పణ చేస్తే కోరికలు సిద్ధిస్తాయని ప్రతీతి.

ఏకాదశి :వైష్ణవాలయంలో దీపారాధన, పురాణ శ్రవణం, జాగరణ విశేష ఫలితాలనిస్తుంది.

ద్వాదశి : సకల దేవతారాధన శుభాన్నిస్తుంది.

త్రయోదశి : నవగ్రహారాధన చేయడం వల్ల గ్రహ దోషాలు తొలగిపోతాయి.

చతుర్దశి : మాస శివరాత్రి నాడు ఈశ్వరార్చన అభిషేకం చేయడం వల్ల అపమృత్యు దోషాలు, గ్రహ బాధలు, తొలగి పరిపూర్ణ ఆరోగ్యవంతు లవుతారు.

అమావాస్య : ఈరోజు పితృదేవతల సంతృప్తి కోసం ఎవరినైనా పిలిచి వారికి భోజనం పెట్టాలి. కుదరకపోతే బ్రాహ్మణులకు స్వయంపాకం ఇవ్వాలి.

పేదల జీవితాలపై పిడుగు

- బాణసంచా తయారీ కేంద్రంపై పిడుగు పడి భారీ విస్ఫోటం
- ఇద్దరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు





కాలిన బాణసంచా తయారీ షెడ్డు



సూర్యారావుపాలెంలో పిడుగుపడిన కొబ్బరిచెట్టు.. కాలిన గాయాలతో మహిళ

ఉండ్రాజవరం/ తణుకు/పెంటపాడు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వారంతా రోజు కూలీలు. పనికి వెళితే తప్ప పూట గడవని కుటుంబాలు. దీపావళి వేళ.. అందరి ఇళ్లల్లోనూ వెలుగులు పంచాలనుకున్నారు. కాని, వారి కుటుంబాలపై పిడుగు పడి.. చీకట్లు అలుముకున్నాయి. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో దీపావళి మందులు తయారీ చేసే షెడ్డు పక్కన వున్న కొబ్బరి చెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. పక్కనే ఈ షెడ్డులో కార్మికులు చిచ్చు బుడ్లు, తారాజువ్వలు తయారు చేస్తున్నారు. ఈ పిడుగు కారణంగా ఇక్కడ భారీ విస్ఫోటనం సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఓ వైపు పిడుగుపాటు శబ్దం, మరోవైపు బాణసంచా పేలుడుతో అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా ఇద్దరు మహిళలు కాలి బూడిదయ్యారు. మరో ఐదుగురి కాలిన గాయాలతో హాహాకారాలు చేస్తూ బయటకు పరుగులు తీశారు. అక్కడే పనిచేస్తున్న మరో తొమ్మిది మంది వెంటనే తేరుకుని ప్రాణాలు దక్కించుకునేందుకు పక్కనే వున్న పంట పొలాల్లోకి పరుగులు తీశారు. ప్రమాదంలో బాణసంచా తయారు చేస్తున్న పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన కార్మికురాలు గుమ్మడి సునీత(38), బాణసంచా తయారీ యజమాని భార్య, తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన వేగరోతు శ్రీవల్లి(35) అక్కడక్కడే మరణించారు. దువ్వకు చెందిన కడిమి కుమారి, చుక్కా పెద్దింట్లు, పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మందలంక కమలరత్నం, సీలం లక్ష్మి, జంగారెడ్డిగూడెంకు చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి వచ్చిన గ్రామస్తులు వీరిని రక్షించే ప్రయత్నం చేశారు. కాలిన గాయాలతో బాధితులు హాహాకారాలు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే సుమారు గంటపాటు వర్షం పడటంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బంది కలిగింది. ఈలోగా తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ గుబ్బల శ్రీనివాసరావు, సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తన జీపులో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం

క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రుల హాహాకారాలు, వారి బంధువుల రోదనలతో ఈ ప్రాంగణం మిన్నంటింది. వీటి మధ్యే వైద్యులు చికిత్స అందించారు. క్షతగాత్రులను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వి.అరుణతో ఆరిమిల్లి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి ఫోన్ చేసి విషయం వివరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. బాధితులను ఆదుకుంటామన్నారు.

పొట్టకూటి కోసం వచ్చిన వారే

బాణసంచా తయారీకి వచ్చిన వారంతా నిరుపేదలే. పొట్టకూటి కోసం వచ్చిన వారే. కొందరు నెల, మరికొందరు రెండు నెలలుగా పనిచేస్తున్నారు. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన గుమ్మడి సునీత(38), మందలంక కమల రత్నం, శీలం లక్ష్మి కొద్ది రోజులుగా రోజూ పనికి వెళ్లి వస్తూ వుంటారు. సునీతకు భర్త శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కమలరత్నంకు భర్త వెంకట్రావు, ఇద్దరు కుమారులు ఉండగా, లక్ష్మీకి భర్త దుర్గారావు కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా తయారీ నిర్వాహకుడు శివకు వ్యాపారంలో తోడుగా ఉండేందుకు ఆయన భార్య శ్రీవల్లి పది రోజులుగా అక్కడకు వెళుతోంది. వీరికి కుమార్తె, కుమారుడు. కుమార్తెకు వివాహమైంది.

జేసీ ఘటనా స్థలం పరిశీలన

తణుకు మండలం వెంకట్రాయపురానికి చెందిన రామ్‌శివాజీ రెండేళ్లుగా చిచ్చుబుడ్డీలు, తారాజువ్వలు తయారు చేస్తున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో 16 మంది బాణసంచా తయారు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జేసీ చినరాముడు, ఆర్డీవో రాణిపద్మజ పరిశీలించారు. రామ్‌శివాజీతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసే వారంతా పేదలేనని, జీవనోపాధి కోసం దూర ప్రాంతం నుంచి ఇక్కడకు 18 మంది వచ్చి చిరు జీతానికి పనిచేస్తున్నారని చెప్పారు. కార్మికులందరికి ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. ఈ రోజు 16 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. మృత్యువు పిడుగు రూపంలో వచ్చి తన భార్య శ్రీవల్లి, మరో మహిళను కోల్పోయా మని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రమాదంలో ఇద్దరు మహిళలు మరణించడం బాధాకరమని జేసీ చెప్పారు. మృతులకు ప్రభుత్వ సహాయ సహకారాలందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



తణుకు ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఆరిమిల్లి, శేషారావు



ఆసుపత్రిలో క్షతగాత్రులు



పాలకొల్లు ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యలన్నీ పరిష్కరించాలి

పాలకొల్లు, అక్టోబరు, 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఐసీ యాజమాన్యంతో ఏజెంట్ల సమస్యలపై చర్చలు జరిపి కొన్ని సమస్యలు పరిష్కరించినప్పటికీ మిగిలిన అన్ని సమస్యలు పరిష్కరించాలని ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద పాలకొల్లు, నరసాపురం ఏరియా ఏజెంట్ల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. యాజమాన్యంతో ఏవోఐ నాయకులు జరిపిన చర్చల్లో అంగీకరించిన వాటితో పాటుగా మిగిలిన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జీఎస్‌టీ తీసి వేయాలని, ఏజెంట్ల కమీషన్ పూర్వం మాదిరిగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జీఎస్‌టీ తీసి వేయాలని డిమాండ్‌చేస్తూ 2025 ఫిబ్రవరి 11న పార్లమెంట్ వద్ద మార్చ్ నిర్వహించాలని కేంద్ర సంఘం నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్రకమిటీ ప్రెసిడెంట్ తొట్టెంపూడి కోటేశ్వరరావు డిమాండ్ తెలిపారు. ఎండీఆర్‌టీ ఎజెంట్ ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెంట్లు అందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని అన్నారు. ఏజెంట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొట్టెంపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ పాలసీదారుల వయస్సును 55 నుంచి 50కి తగ్గించడం న్యాయం కాదని, 55 ఏళ్లకే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ అధ్యక్షుడు కె.ఏలియా, యు.భాస్కర రావు, జి బాలాజీ, బి.రమేష్ కుమార్, వై.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో దాసి రాజుతో కలిసి సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

గోదావరి పుష్కరాలకు ముందస్తు ప్రణాళిక

- అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే నాయకర్ సమీక్ష

నరసాపురం, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఈసారి గోదావరి పుష్కరాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అన్నిశాఖల అధికారులు ముందస్తుగా సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో దాసిరాజుతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. 2015 పుష్కరాలకు పట్టణానికి సుమారు 50 లక్షల భక్తులు విచ్చేశారన్నారు. ఈసారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పాలకొల్లు, భీమవరం, మొగల్తూరు నుంచి వచ్చే వాహనాలకు వీలుగా చేపట్టాల్సిన రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు ఏడాదిన్నర ముందు నుంచే అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వానికి ముందుగా ప్రతిపాదనలు అందిస్తే ఎక్కువ నిధుల్ని మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మేకల సతీష్, కమిషనర్ అంజయ్య, డీఈ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సరిపల్లిలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

టీడీపీకి కార్యకర్తలే బలం : బండారు

నరసాపురం, అక్టోబరు30, (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తెలిపారు. బుధవారం సరిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఈద సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునే కార్యకర్తలకు కలిగే పార్టీ సహకారాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవ రాంబాబు, మైలాబత్తుల గజశేఖర్, మైలాబత్తుల ఉమా, దేవరపు నాని, భాను, గంధం సత్యనారాయణ, మోపిదేవి శ్రీనివాస్, దాయిం బంగార్రాజు, పుప్పాల చిన్నబాబు, ధర్మకృష్ణ, రేకపల్లి సురేష్, కాంతారావు, కాజా గోపీనాథ్, రేవు ప్రభుదాస్, చాగంటి సురేష్, పి.బాలకృష్ణ సుమారు 150 సభ్యత్వాలు నమోదు చేశారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి

- పెనుమదంలో మహిళల ధర్నా



పెనుమదంలో మద్యం షాపు వద్ద మహిళల ఆందోళన

పోడూరు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : పెనుమదం చిట్టితగుంట రోడ్డులో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ మహిళలు, స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని మద్యం షాపు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న మహిళలు, హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారని సమీపంలో హైస్కూల్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాన్ని ఇక్కడ నుంచి తొలగించాలని కోరుతూ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారానికి వచ్చి నప్పుడు సమస్యను తెలిపామని, ప్రభుత్వం రాగానే తొలగిస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు తొలగించగలేదని వాపోయారు. అనంతరం మద్యం దుకాణం లైసెన్స్‌దారుడు వచ్చి ఇక్కడ నుంచి మద్యం దుకాణాన్ని తొలగిస్తానని కొద్ది సమయం ఇవ్వాలని కోరడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. ధర్నాలో ముచ్చర్ల సీతామహా లక్ష్మి, దేవరపు మంగతాయారు, బాలం వరలక్ష్మి, ముచ్చర్ల శ్రీనివాసరావు, గోపిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

- దుండగుల ఆధార్‌కార్డుతో గుట్టురట్టు
- ఆరుగురిని అరెస్టు చేసిన భీమవరం టూటౌన్ పోలీసులు

భీమవరం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆమెతో ఏడడుగులు వేసి, జీవితకాలం కలిసి ఉంటానని ప్రమాణం చేశాడు. అయితే ఆమెను కడతేర్చడానికి సినిమా ఫక్కీలో పక్కాప్లాన్ వేసి పోలీసులకు చిక్కిన ఘటన భీమవరంలో జరిగింది. భీమవరం టూటౌన్ ఎస్‌ఐ ఎస్‌ఐ ఎ.ఇజ్రాయిల్ తెలిపిన వివరాలివి.. భీమవరం వంశీకృష్ణనగర్‌కు చెందిన భూపతిరాజు మధు అనే మహిళ గతంలో వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. భర్తతో విబేధాల కారణంగా కుమారుడితో కలిసి వంశీకృష్ణ నగర్‌లోనే ఐదో అంతస్తులో ఉంటున్నారు. 2013వ సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన భూపతిరాజు ఉదయ్‌శేఖర్‌రాజుతో ప్రేమ వివాహం చేసుకున్నారు. మళ్లీ వారికి ఓ కుమారుడు జన్మించారు. కొంత కాలం తరువాత ఇద్దరికి విబేధాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. 2022లో భీమవరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్‌శేఖర్‌రాజుపై అదనపు కట్నం, మరికొన్ని కేసులు పెట్టడంతో అవి ప్రస్తుతం కోర్టులో ఉన్నాయి. ఈక్రమంలో వేర్వేరుగా ఉంటున్న మధు, ఉదయశేఖర్‌రాజు ఎవరి పని వారు చేసుకుంటున్నారు. తనపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న భార్యను ఎలాగైనా హతమార్చాలని పక్కా ప్లాన్ చేశాడు. తన వద్ద పనిచేస్తున్న కృష్ణా జిల్లా బంటుమిల్లి గ్రామానికి చెందిన రౌడీషీటర్ కూనపురెడ్డి నాగవెంకటవీర్రాజుతో హత్య కోసం పన్నాగం చేసి రూ. 5 లక్షలు సుపారి మాట్లాడాడు. దీంతో కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన రౌడీషీటర్ కర్రా లాజర్, కొత్తగూడెం మనుగూరుకు చెందిన రౌడీషీటర్ షేక్ తర్వర్‌పాషా, గుడివాడకు చెందిన రౌడీషీటర్ గొల్లపల్లి పోతురాజు, యలమర్తి నానిలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వారికి రూ.20వేలు అడ్వాన్స్ ఇచ్చారు.

నిందితులను పట్టించిన ఆధార్‌కార్డు..

ఈనెల 27వ తేదీన రౌడీషీటర్లు ముగ్గురైన కర్రా లాజర్, షేక్ తర్వర్ పాషా, గొల్లపల్లి పోతురాజు, మరో వ్యక్తి యలమర్తి నాని భీమవరం చేరుకున్నారు. ముందువేసుకున్న ప్లాన్ ఆధారంగా మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో మధు ఉంటున్న అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి ఆమెను గట్టిగా హెచ్చరించి వెంట తీసుకు వెళ్ళిన కత్తితో ఆమెను పొడవబోయారు. ఆమె వారిని ప్రతిఘటించి గట్టిగా కేకలు వేయడంతో ఆ నలుగురు నిందితులు పరారయ్యారు. ఆ సమయంలో షేక్ తర్వర్ పాషా జేబులో నుంచి అతడి ఆధార్ కార్డు కింద పడింది. అది గమనించకుండా వారు వెళ్ళిపోయారు. అనంతరం తేరుకున్న మధు ఆధార్‌కార్డు ఆధారంగా ఈనెల 29వ తేదీన భీమవరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి 24 గంటలు గడవక ముందే నిందితులైన ఉదయశేఖర్‌రాజు, నాగవెంకట వీర్రాజు, లాజర్, తర్వర్ పాషా, పోతురాజు, నానిలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎస్‌కేఎస్‌డీ విద్యార్థినులకు బహుమతులు



తణుకు, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో చెస్ ఉమెన్ ఇంటర్ కాలేజియేట్ యూనివర్సిటీ ఎంపికల్లో ఈనెల 26,27వ తేదీలలో భీమవరం బీవీ రాజు కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయి తెలిపారు. టి.ఎస్.ఎన్ శ్రావణి, ఎం.శ్రీరమ్య కె.జ్యోతి, ఎం.శ్రీలత, కె.వి.నాగశ్రీ, వి.హర్షిత ప్రథమ స్థానంలో నిలిచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిను లను జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అభినందించారు. పీడీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బట్టలు ఆరవేస్తుండగా..

- విద్యుత్‌షాక్ తగిలి మహిళ మృతి

యలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపట్ల గ్రామానికి చెందిన మంచెం భూలక్ష్మి(33) బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన భూలక్ష్మి తన ఇంటిపై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు తడిబట్టలు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఏఈఈ వెంకటేశ్వర్లుకు సత్కారం

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగళ్ళమూడి వెంకటేశ్వర్లు సేవలు స్ఫూర్తిదాయకమని డీపీఆర్ఓ టీ.నాగేశ్వరరావు అన్నారు. డీపీఆర్వో కార్యాలయంలో పనిచేసి పదవీ విరమణ చేసిన అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజ నీరు నాగళ్ళమూడి వెంకటేశ్వర్లు పదవి విరమణ అభినందన సభకు డీపీఆర్వో తలుపులు నాగేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొని సత్కరించారు. సీనియర్ అసిస్టెంటు కె. సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీని వాస నెప్రూరా, ఆర్.ఎ డి.సోమరాజు, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశా లి, పి.వై.రత్నాకర్, తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.



మాణిక్యం దంపతులకు సత్కారం

ఆకివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం పొందడం కత్తిమీద సాములాంటిదేనని రైల్వేస్టేషన్ విశ్రాంత మేనేజర్ వర్ధినీడి మాణిక్యం అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో మేనేజర్‌గా ఆరున్నరేళ్ళ పనిచేసి బుధవారం రిటైరవుతున్న మాణిక్యం దంపతులను రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ప్రముఖులు, సహోద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. రైస్ మిల్లర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వానపల్లి బాబూరావు, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, సాంఘిక న్యాయవేదిక కన్వీనర్ డీవీ రమణమూర్తి, రైల్వే స్టేషన్ మేనేజర్ అల్లం సురేష్‌కుమార్, రవాణా అధికారి నందేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దీపావళి సంబరాలు

పాలకోడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో దీపావళి సంబరాలు బుధవారం పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. కళాశాల చైర్మన్ వత్సవాయి శ్రీనివాసరాజు మాట్లాడుతూ చిరుదివ్వెల దీపావళిని బాల బాలికలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సాంప్రదాయ పద్ధతులను తెలుసుకోవాలని కోరారు.

వరద బాధితులకు నాగిడిపాలెం వాసుల విరాళం

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో ఉన్న వారికి దాతలు అందిస్తున్న సహకారం అద్వితీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు (అంజి బాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వరద బాధితుల సహాయార్థం నాగిడిపాలెం గ్రామస్థులు రూ. లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. వరద బాధితులకు ప్రతిఒక్కరు స్పందించి ముందుకు రావడం అభినందనీయమని, దాతలను అభినందించారు. కార్యక్రమంలో తిరుమాని మోహన్ రావు, తిరుమాని సూర్య నాగిడిపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

కౌశల్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

భీమవరం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ రంగ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌశల్ రాష్ట్ర స్థాయి ప్రతిభా అన్వేషణ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా కౌశల్ 2024 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కౌశల్ జిల్లా సమన్వయ అధికారి ఆచంట వర్రప్రకాష్ మాట్లాడుతూ 8, 9, 10 తరగతి విద్యార్థులు నవంబరు 15వ తేదీ లోపు వారి పాఠశాలల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయకర్తని సంప్రదించాలని సూచించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

రన్ ఫర్ యూనిటీ

భీమవరం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాలు విజయవంతానికి సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భీమవరంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. జిల్లావ్యాప్తంగా పది రోజులుగా పలు కార్యక్రమాల నిర్వహణకు తమ తోడ్పాటునందించిన పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా పోలీస్ శాఖ తరఫున జ్ఞాపికలను అందించారు. ఏఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, భీమవరం సబ్ డివిజన్ డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం. సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ కె. వెంకట్రావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి. పుల్లారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘ సేవకులు రంగసాయి, అల్లుకు సత్కారం



భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగస్వాములై సేవలందించిన సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్ లను ఎస్పీ నయీమ్ అస్మి జ్ఞాపికతో సత్కరించారు. ఎఎస్పీ పి. భీమారావు, డిఎస్పీ జయసూర్య, సత్యనారాయణ, సీఐలు నాగరాజు, కాళీ చరణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: సీతారామలక్ష్మి



భీమవరం అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణంలోని బలుసుమూడి 29, 30, 31, 32 వార్డులలో పార్టీ సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడుతూ రూ. 100 సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా పరిహారం, సంబంధిత కుటుంబీకులకు విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీ నాయకులు పామర్తి వెంకట రామయ్య, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, భూపతిరాజు బుజ్జిరాజు, వీరమల్లు వెంకటరమణ, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళనలో టెట్ అభ్యర్థులు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 30 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) స్కూల్ అసిస్టెంట్ (2వ) సబ్జెక్టులో మాతృభాష తెలుగు రాయవలసి ఉండగా చాలా మంది ఆంగ్ల భాషను ఎంచుకోవడం వల్ల తమకు నష్టం జరుగుతుందని టెట్ పరీక్షలు ఆంగ్లంలో రాసిన అభ్యర్థులు పలువురు టెట్-2024 రాష్ట్ర కన్వీనర్‌కు బుధవారం వినతి పత్రం అందజేసినట్టు పట్టణానికి చెందిన సంగెళ్ల వెంకటేశ్వర రావు తెలిపారు. దీనివల్ల తమకు టెట్ నిబంధనల మేరకు 4 విభా గాలకు కలిసి 150 మార్కులు ఉంటాయని, ఆయా సబ్జెక్ట్ కంటెంట్‌కు సంబంధించి 90 మార్కులు, మిగిలిన మూడు సెక్షన్లకు 30 మార్కులు చొప్పన మార్కులు ఉంటాయని, మాతృభాషను ఎంపిక చేసుకున్నప్పటికీ ఆంగ్లంలో పరీక్ష రాయడం వల్ల 30 మార్కులు తేడా వచ్చి నష్టపోతామని తెలిపారు. టెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో మాతృభాషను ఎంపిక చేసుకున్న ఆంగ్ల సబ్జెక్టే వచ్చింది. దీనిపై అప్పట్లోనే ఫిర్యాదు చేయడం జరిగిందని, దీనిపై సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల ఈ విధంగా వచ్చింది. పరీక్ష కేంద్రాల్లో మార్పులు చేస్తామని అధికారులు చెప్పారని, అయితే సాంకేతిక సమస్య ఏర్పడిందన్నారు.







3న దేవ తిలకుల సంఘం రజతోత్సం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3న పట్టణ దేవ తిలకుల సంఘ రజతోత్సవం జిల్లా సంఘం ఆధ్వర్యంలో లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకులు తెలిపారు.పలు సేవా కార్యక్ర మాలు, కార్తీక దామోదర పూజలు, వన భోజ నాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిధులుగా మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ హాజరు కానున్నారని తెలిపారు.

సభ్యత్వాలకు అనూహ్య స్పందన

నరసాపురం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని పొన్నపల్లి, గంటాలమ్మ కాలనీ వద్ద సభ్యత్వ నమోదును నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.


ఆచంట : ప్రతి టీడీపీ కార్యకర్త పార్టీ సభ్యత్వాన్ని పొందాలని జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు కోరారు. బుధవారం కొడమంచిలిలో జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీను, బాలం వెంకట రమణ, రాపాక ఆనందరావు, కొరిపల్లి రామకృష్ణ, తేజ, నెక్కంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్వో కూపన్లు అందజేత

ఆచంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గొడవర్తి రామారావు, లక్ష్మీ వెంకట నర్సమాంబ చారిటబుల్ ట్రస్టు రూ. 40 వేలు విలువ చేసే ఉచిత ఆర్‌వో వాటర్ కూపన్లు ట్రస్టు నిర్వాహకులు, మానవత గౌరవ డైరెక్టర్ గొడవర్తి శ్రీరాములు చేతుల మీదుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు.









పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక సిబ్బంది

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి. రాజారావు బుధవారం వెల్లడించారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వీరు నవంబర్ 16న బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులను గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారి భారతి, ప్రిన్సిపాల్ రాజారావు, సిబ్బంది అభినందించారు.

మానవత చేయూత

తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమైన దివ్యాంగురాలికి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సేవా సంస్థ రూ. పదివేలు అందజేసింది. పెరవలికి చెందిన కౌజుల విజయగౌరికి మానవత అధ్యక్షురాలు కఠారి శారదాదేవి ఆధ్వర్యంలో అందజేశారు. శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాలకు అనూహ్య స్పందన

నరసాపురం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన లభిస్తోందని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని పొన్నపల్లి, గంటాలమ్మ కాలనీ వద్ద సభ్యత్వ నమోదును నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

ఆచంట: ప్రతి టీడీపీ కార్యకర్త పార్టీ సభ్యత్వాన్ని పొందాలని జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు కోరారు. బుధవారం కొడమంచిలిలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీను, బాలం వెంకట రమణ, రాపాక ఆనందరావు, కోరిపల్లి రామకృష్ణ, తేజ, నెక్కంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష వద్దు

పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్యజ్యోతి): గ్రామాలలో కులవివక్ష లేకుండా అందరూ కలసి మెలసి ఉండాలని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ అన్నారు. మీనవల్లూరు ఎస్సీ కాలనీలో బుధవారం 'సివిల్ రైట్స్ డే'ని సర్పంచ్ చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కాలనీ వాసుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

వాసవీమాత హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించినట్లు ఆలయ ఈవో జి. రామ పెద్దింట్లరావు తెలిపారు. 110 రోజులకు గాను రూ.5,43,436/-లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. తణుకు తనిఖీదారు పర్యవేక్షణలో లెక్కించారు. ఈవో రామ పెద్దింట్లరావు, వడలి ఈవో మన్నె శ్రీనివాసు, జుత్తిగ ఈవో పీఆర్‌కెఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంతోనే వికాసం

అత్తిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యమని హెల్త్ అసిస్టెంట్ స్వామి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి 252 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశువు ఆరోగ్య ప్రగతి రికార్డులను బుధవారం అందజేశారు. రాష్ట్రీయ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి, ధనలక్ష్మి, విజయవాణి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

3న దేవ తిలకుల సంఘం రజతోత్సం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3న పట్టణ దేవ తిలకుల సంఘ రజతోత్సవం జిల్లా సంఘం ఆధ్వర్యంలో లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్టు సంఘ నాయకులు తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు, కార్తీక దామోదర పూజలు, వన భోజనాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ హాజరు కానున్నారని, పలు వినోద కార్యక్రమాలు, మహిళలకు ఆటలు ఏర్పాటు చేయడం జరిగిందని, నియోజక వర్గంలోని సంఘ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులకు అండగా ఉంటా

నరసాపురం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు తాను అండగా ఉంటానని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని కళ్యాణి మానసిక దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వయంగా భోజనాలు వడ్డించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బెడ్‌లు అందించారు.

కనీస వేతనం అమలు చేయాలి

పెనుమంట్ర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పారిశుధ్య, కాంట్రాక్టు వర్కర్స్‌కు కనీస వేతనం అమలుచేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. బుధవారం పంచాయతీ కార్మికురాలు బంగారు విజయ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో యూనియన్ నాయకుడు ఎం. అంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

మహనీయుల ఆశయాలు ఆదర్శం కావాలి

ఘనంగా వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు

పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం దేశ తొలి హోం మంత్రి వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు విక్టర్ ప్రేమ్‌సాగర్, విజయ్‌బాబు, డాక్టర్ సుంకర గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత ర్యాలీ

పాలకొల్లు అర్బన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత ర్యాలీ, 5కె సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రాజ రాజేశ్వరి మాట్లాడుతూ రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులచే సమగ్రత, భద్రతను కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వల్లభాయ్ పటేల్ త్యాగనిరతిని వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ వివరించారు. స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మన దేశ ప్రథమ హోం మంత్రి పటేల్ ఉక్కు మనిషిగా పేరొందరని అన్నారు. పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాంబాబు ప్రసన్న, నాగదేవి, అధ్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొల్లులో ఐక్యతా ర్యాలీ

గ్రీన్ దీపావళి జరుపుకోవాలి: సీఐ



భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హిత దీపావళి జరుపుకోవాలని ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి అన్నారు. వెస్ట్‌బెర్రీ స్కూల్‌లో గ్రేడ్ 8, 9 విద్యార్థులు పర్యావరణ అనుకూలమైన దీపావళి గురించి బుధవారం నాడు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి, వన్‌టౌన్ సీఐ నాగరాజు, మా ఫౌండర్ డైరెక్టర్ మహేష్‌కుమార్, ప్రిన్సిపాల్ సారా స్మిత ర్యాలీలో పాల్గొని, దీపావళిని సహజ సిద్ధంగా నిర్వహించేందుకు విద్యార్థులు చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా నిలిచారు. విద్యార్థులు గ్రీన్ దీపావళి, క్లీన్ దీపావళి అంటూ నినాదాలు చేస్తూ కాలుష్యాన్ని తగ్గించి, గ్రీన్ దీపావళిని ఎంచుకోవాలనే సందేశాన్ని ప్రచారం చేస్తూ ఉత్సాహంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

నేటి పొదుపు భవిష్యత్తుకు మలుపు



భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి పొదుపు భవిష్యత్‌కు మలుపని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ పొదుపు దినోత్సవాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్‌లో బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు పొదుపుపై పోటీలు విజేతలకు విద్యా సామగ్రి అందించారు. సర్ సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపాల్‌పెండ్యాల సరిత, ఎన్. రాధ, శైలజ, కే పార్వతి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

యలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చించినాడ గ్రామానికి చెందిన ఏడుగురు కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఏనుగువానిలంక గ్రామ పరిధిలోని తన భూమిలో కూరగాయలు సాగు చేసుకుంటున్నానని, కొందరు తన భూమికి సమీపంలోని ఆక్వా చెరువుల్లోని ఉప్పు నీటిని బయటకు తోడుతుండగా తాను వెళ్లి ఫొటోలు తీస్తుండగా తనను కులంపేరుతో దూషించారని నల్లి నరేష్ ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం: ఆరిమిల్లి



తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య సేవలో వైద్యం పొందలేని వారికి ప్రథమ ప్రాధా న్యం ఇస్తూ సీఎం రిలీఫ్ పండ్ చెక్కులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని 12 మందికి రూ. 15 లక్షల 7 వేల 559 అందించినట్టు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పుంతల ముసలమ్మ జాతర



నరసాపురం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డులో కొలువైన పుంతల ముసలమ్మ జాతర మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి ప్రభోత్సవంను పట్టణ వీధుల గుండా ఊరేగించారు. కొవ్వలి ట్రస్టు చైర్మన్ కొవ్వలి రామ్మోహన్‌నాయుడు ఆర్థిక సహకారంతో గరగల నత్యాలు, కాళికమాత, బుట్ట బొమ్మలు, బాణసంచా కాల్చుతూ ఊరేగించారు. నిమ్మకాల గోపాలరావు, నీలిమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె రాంబాబు, బుజ్జిబాబు, త్రిమూర్తులు, వీర వెంకటసత్యనారాయణ, సంకు భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తులపై సమీక్ష

అత్తిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా విజ్ఞప్తులపై తీసుకోవాల్సిన చర్యలపై అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో తహసీల్దార్ దశిక వంశీ సమీక్షా సమావేశం నిర్వహించారు. బాణాసంచా వ్యాపారాలు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. దీపావళి అనంతరం ధాన్యం కొనుగోలు ప్రారంభమ వుతుందని, రైతులు తమకు ఇష్టమున్న మిల్లులకు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చు న్నారు. అత్తిలి ఎంపీడీవో పి. శామ్యూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి

భీమవరం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని బాలల సంక్షేమ శాఖ రీజనల్ ఇనస్పెక్టర్ సి.వెంకటపతి రాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో సంస్థలు, వ్యక్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్న వారు నిర్దేశించబడిన దరఖాస్తులతోపాటు అన్ని కాపీలను జత చేసి వచ్చేనెల 11 తేదీ లోపుగా సంచాలకులు, బాలల సంక్షేమ, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ విజయవాడ కార్యాలయానికి అందజేయాలన్నారు. దీనికి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, చిరునా మా, అర్హతలు, జతపరచవలసిన డాక్యుమెంట్లు చెక్ లిస్టు మొదలైన వాటిని వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తులను స్పీడ్ పోస్టులేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మాత్రమే పంపాలన్నారు. ఏమైనా సందేహాలకు జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ సెల్ నంబర్ 94910 63818కు సంప్రదించాలని తెలిపారు.

వసతి గృహాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలి



పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, మరుగుదొడ్ల డోర్లు తదితర వాటికి మరమ్మతులు చేయించాలని హౌసింగ్ పీడీ పిచ్చియ్య అన్నారు. బుధవారం పెంటపాడు, పరిమెళ్ల గ్రామాల్లో ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ రాజేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంకు వాటర్ ప్యూరిఫైర్ వితరణ



తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో రాణించడం అభినంద నీయమని ఏపి నిట్ రిజిస్ట్రార్ పి. డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్ కుమార్ అన్నారు. ఏపి నిట్‌లోని ప్రయత్నం క్లబ్ ఆధ్వర్యంలో హాస్టల్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ వెంకట దినేష్ సౌజన్యంతో విద్యార్థులు తణుకు చిల్డ్రన్ హోమ్‌కు వాటర్‌ప్యూరిఫైర్ అందజేశారు. టీం సభ్యులు పాల్గొన్నారు.









ఆందోళనలో టెట్ అభ్యర్థులు

ఆంగ్లభాష ఎంచుకోవడంతో నష్టపోయామని ఆవేదన

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 30 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) స్కూల్ అసిస్టెంట్ (2వ) సబ్జెక్టులో మాతృభాష తెలుగు రాయవలసి ఉండగా చాలా మంది ఆంగ్ల భాషను ఎంచుకోవడం వల్ల తమకు నష్టం జరుగుతుందని టెట్ పరీక్షలు ఆంగ్లంలో రాసిన అభ్యర్థులు పలువురు టెట్ -2024 రాష్ట్ర కన్వీనర్‌కు బుధవారం వినతి పత్రం అందజేసినట్టు పట్టణానికి చెందిన సంగెళ్ళ వెంకటేశ్వరరావు తెలిపారు. దీని వల్ల తమకు టెట్ నిబంధనల మేరకు 4 విభాగాలకు కలిసి 150 మార్కులు ఉంటాయని, ఆయా సబ్జెక్ట్ కంటెంట్‌కు సంబంధించి 90 మార్కులు, మిగిలిన మూడు సెక్షన్లకు 30 మార్కులు చొప్పున మార్కులు ఉంటాయని, మాతృభాషను ఎంపిక చేసుకున్నప్పటికీ ఆంగ్లంలో పరీక్ష రాయడం వల్ల 30 మార్కులు తేడా వచ్చి నష్టపోతామని తెలిపారు. టెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో మాతృభాషను ఎంపిక చేసుకున్న ఆంగ్ల సబ్జెక్టే వచ్చింది. దీనిపై అప్పట్లోనే ఫిర్యాదు చేయడం జరిగిందని, దీనిపై సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల ఈ విధంగా వచ్చింది. పరీక్ష కేంద్రాల్లో మార్పులు చేస్తామని అధికారులు చెప్పారని, అయితే సాంకేతిక సమస్య ఏర్పడిందన్నారు. దీంతో అభ్యర్థులు తెలుగు పరీక్ష రాయలేక పోయారని తెలిపారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు: ఏడీఈ

నరసాపురం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. బుధవారం లక్ష్మణేశ్వరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక ఎకరానికి 15 కేజీల యూరియా, 50 కేజీల భాస్వరం, 14 కేజీల పొటాష్ ఎరువులను చివరి దుక్కిలో పొలంలో కలపాలన్నారు. దీని వల్ల భూసారం పెరిగి దిగుబడి ఇస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఈవో నారాయణ, లక్ష్మీకాంతం, జయలక్ష్మి, వెన్నెల, రామకృష్ణ, గంగాధర్, మల్లేశ్వరావు, శ్రీనివాస్, రాము, లక్ష్మిలు పాల్గొన్నారు.



దంచికొట్టిన వాన

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో బుధ వారం వర్షం దంచి కొట్టింది. మండలంలోని పెదతాడేపల్లి, వెంక ట్రామన్న గూడెం, కుంచన పల్లి తదితర గ్రామాల్లో సుమారు గంటన్నర పాటు వర్షం ముంచెత్తింది. బాణాసంచా కొనుగోలుదార్లు ఇబ్బంది పడ్డారు.

ఉండిలో కుండపోత

ఉండి: ఉండిలో కుండపోత వర్షానికి సీసీ రహదారులపై నీరు చేరి అధ్వానంగా మారాయి. బుధవారం దఫదఫాలుగా కురిసిన వర్షానికి రోడ్లుపై వర్షపునీరు చేరి పాదచారులు, వాహనచోదకులు అవస్థలుపడ్డారు. రోడ్లుకి ఇరువైపుల కచ్చా డ్రెయిన్లు లేకపోవడంతో రోడ్లుపైనే నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

ఉచితంగా ఆర్వో కూపన్లు అందజేత

ఆచంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గొడవర్తి రామారావు, లక్ష్మి వెంకట నర్సమాంబ చారిటబుల్ ట్రస్టు రూ. 40 వేలు విలువ చేసే ఉచిత ఆర్‌వో వాటర్ కూపన్లు ట్రస్టు నిర్వాహకులు, మానవత గౌరవ డైరెక్టర్ గొడవర్తి శ్రీరాములు చేతుల మీదుగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. కుక్కల లీలా ప్రసాద్, కొల్లేపర వెంకన్నబాబు, నెక్కంటి శివన్నారాయణ, నంబూరి అంజిబాబువేంద్ర శ్రీనివాస్, కొమ్మన పెద్ది సూర్యనారాయణ,మూర్తి శర్మ, తమ్మినీడి సత్యనారాయణమూర్తి,మానేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆంధ్రజ్యోతి కథనాన్ని సమావేశం దృష్టికి తీసుకెళ్ళిన కౌన్సిలర్లు

ఆకివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను చైర్మన్ జామి హైమవతి సూచించారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశం జరిగింది. 20వ వార్డులో తాగు నీరు, డ్రైనేజీ, వీధిలైట్లు, డంపింగ్ యార్డు సమస్యలున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి ప్రతీ కౌన్సిల్ సమావేశంలో తీసుకొచ్చిన పరిష్కారం చేయడంలేదని కౌన్సిలర్లు ఆగ్రహించారు. కొండయ్య మ ంచినీటి చెరువు సర్వే చేయించి ఆక్రమణలు స్వాధీనం చేసుకొని, దాతల సహకారంతో తవ్వుకోవడానికి అధికారులు అనుమతులివ్వాలని వైస్ చైర్మన్ పుప్పాల పండు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్ళగా ఈ విషయం ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్ళతానని క మీషనర్ తెలిపారు. ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు చైర్మన్ జామి హైమవతి, కమీషనర్ జి.కృష్ణమోహన్‌కు ఆంధ్రజ్యోతిలో వచ్చిన శీర్షిక కటింగ్‌తో వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జోత్స్న, విప్ పడాల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు, అధికారు లు పాల్గొన్నారు.

స్వాముల భిక్ష ఏర్పాటుకు రూ. 1.30 లక్షల విరాళం

ఆకివీడు రూరల్ అక్టోబరు 30: ఆకివీడు మండలం కుప్పనపూడిలో అయ్యప్ప మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేసినవారికి రూ.1.30 లక్షలు మోటుపల్లి సాయి మిత్ర బృందం అందజేశారు. టీడీపీ యువ నాయకుడు మోటుపల్లి సాయి జన్మదినం సందర్భంగా అయ్యప్పస్వామి, శివస్వాములకు ఉచితంగా భిక్ష, అల్పాహారం అందజేసేందుకు ఈ నగదు అందజేసినట్లు తెలిపారు. పేదలకు, రోగలకు పళ్ళు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. అనాథాశ్రమంలో భోజనం అందజేశామన్నారు. గురుస్వామి, నూకల రాందాసు, బండికొండ, వెలివెల శివ స్వామి తదితరులు పాల్గొన్నారు.



